క్లుప్తంగా

ఇళ్ల పట్టాల పంపిణీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 16వ డివిజన్ లబ్ధిదారులకు మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయంలో శనివారం మేయర్ నీరజ, ఉప మేయర్ ఫాతిమా జోహార, మంత్రి తనయుడు యుగంధర్‌లు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, 16వ డివిజన్ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నానో యూరియాతోనే అధిక ప్రయోజనం

కామేపల్లి: నానో యూరియాతోనే రైతులకు అధిక ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. శనివారం కొమ్మినేపల్లి రైతు వేదికలో డీలర్ల ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులకు నానో యూరియా వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరించి చైతన్యపర్చాలన్నారు. ఎరువులు, మందుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని, ఎరువులను ఎమ్మార్పీలకే విక్రయించాలని సూచించారు. అనంతరం కళాజాత బృందం నానో యూరియా వల్ల పంటలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, సీఈఓ దొడ్డ ముత్తయ్య, గాదె నాగయ్య, కాలం ఉపేందర్‌రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల వితరణ

కూసుమంచి: మండలంలోని లింగారంతండా ప్రాథమిక పాఠశాలకు తండాకు చెందిన వడిత్య కిషన్‌నాయక్ రూ.5వేల విలువైన పండ్లు, పూల మొక్కలను వితరణ చేశారు. ఈమేరకు శనివారం పాఠశాలలో ఆ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బానోత్ రవి, రాము, వడిత్య రవి తదితరులు పాల్గొన్నారు.

మూడు మోటార్లు చోరీ

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంలో మహాలక్ష్మి రేకుల ఫ్యాక్టరీ నుంచి మూడు మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. త్రీ హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మూడు కొత్త మోటార్లు తీసుకొచ్చి ఫ్యాక్టరీలో పెట్టగా శుక్రవారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లారు. ఈవిషయమై యాజమాన్యం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

రేపు సీపీఎస్ సమావేశం

ఖమ్మంవైద్యవిభాగం: సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ సెప్టెంబర్ 1న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎస్ ఉద్యోగుల సంఘం(టీజీసీపీఎస్ఈయూ) జిల్లా ఉపాధ్యక్షుడు కమల్ల రవితేజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆత్మగౌరవ సభ ద్వారా ఉద్యోగులు సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ పునరుద్ధరణ చేయాలన్న తమ దీర్ఘకాలిక డిమాండ్‌పై ప్రభుత్వ దృష్టి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

బకాయిలు చెల్లించండి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంపై నిర్లక్ష్యం వీడి వెంటనే ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సాయం పొందేందుకు పేదలు ప్రయత్నిస్తున్నా.. ప్రభుత్వం నుంచి చెల్లింపులు లేకపోవడంతో ఆస్పత్రి యాజమాన్యాలు వైద్య సాయం చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఇదే సమయాన సీజనల్ వ్యాధులతో ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తే ఆశించిన స్థాయిలో వైద్యం అందకపోవడంతో పాటు మందులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. బకాయిల విడుదల చేసి వైద్యాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

యంత్రాల వినియోగంపై అవగాహన



రైతులకు వివరిస్తున్న డీఎం అలీం

నేలకొండపల్లి: రైతుల ధాన్యాన్ని డ్రయర్, ఆటోమేటిక్‌ప్యాడీ క్లీనర్స్ మిషన్ ద్వారా ఎండబెట్టే విధానంపై శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెన్నపూసల సీతారాములు మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనం కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మార్కెట్‌కు ఈ మిషన్ అందించినట్లు తెలిపారు. యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్కెటింగ్ డీఎం ఎం.ఏ.అలీం, సివిల్ సప్లై డీఎం జి.శ్రీలత, ఏఓ ఎం.రాధ, రైతులు నెల్లూరి భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, బెల్లం శ్రీనివాసరావు, కుక్కల హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కూలీ
వినోద	కొత్త లోక, మహావతార్ నర్సింహా
సాయిరాం	బ్రహ్మాండ
ఆదిత్య	సుందరకాండ, త్రిబనాదరీ బార్‌బరిక్
శ్రీనివాస	వార్–2

- ఖమ్మంగాంధీచౌక్

ఊరించి.. ఉసూరుమనిపించి!

అయోమయంలో రాజీవ్ యువ వికాసం

- తుది జాబితాపై స్పష్టత కరువు
- నిరాశలో నిరుద్యోగ యువత
- అమలులో ప్రభుత్వం కాలయాపన

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాస పథకం అమలుకు నోచుకోవడం లేదు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముగిసినా.. తుది జాబితాలను విడుదల చేయడం లేదు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లోన్ మంజూరు పత్రాలను అందించేందుకు చర్యలు చేపట్టగా.. చివరి నిమిషంలో వాయిదా పడింది. ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలోనూ ఏ నిర్ణయం తీసుకోలేదు. దీంతో పథకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న యువత నిరాశకు గురవుతున్నారు.



నేలకొండపల్లి ఎంపీడీఓ కార్యాలయం

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలో రాజీవ్ యువ వికాసం పథకానికి వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. పాలేరు డివిజన్‌కు ఇచ్చిన లక్ష్యం ప్రకారం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలను అందజేస్తామని ప్రభుత్వం ముందుగా ప్రకటించింది. కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా వేయడంతో దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు. పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో ఎక్కువగా నేలకొండపల్లి మండలంలో దరఖాస్తులు అందాయి. దరఖాస్తుదారులు ప్రభుత్వం ప్రకటన కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

లోతుగా విచారిస్తేనే..

రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి పాలేరు నియోజకవర్గంలో ఎక్కువగా రావడంతో అనర్హులను పక్కన పెట్టారు. బ్యాంకు పూచీకత్తు తర్వాత మండల స్థాయి కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తుది జాబితాలను కూడా సిద్ధం చేశారు. ఈ పథకంలో రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల యూనిట్లు కోసం దరఖాస్తులు భారీగా వచ్చాయి. మరింత లోతుగా విచారణ చేసిన తర్వాత లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

మార్పులకు మరో అవకాశం..

యువ వికాసం పథకంలో మారిన నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులు యూనిట్లను ఎంపీఈడీఓ కార్యాలయాల్లో మార్చుకునే అవకాశం కల్పించారు. గతంలో ఎడిట్‌కు అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అనంతరం రూ.3 లక్షలు, రూ.4లక్షల యూనిట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి కూడా ఇస్తామని చెప్పింది. కానీ ఇంత వరకు ఎలాంటి రుణాలు ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు.

దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలి..



దివ్యాంగులకు అన్ని యూనిట్లలో ప్రాధాన్యత కల్పించాలి. ప్రభుత్వం దివ్యాంగులను అర్థం చేసుకుని రుణాలు మంజూరు చేయాలని కోరారు. పాలేరులో 50 శాతం వరకు దివ్యాంగులకు ఇవ్వాల్సిందే. కనీసం ప్రతీ గ్రామంలో పది మందికి అవకాశం కల్పించాలి.

– పి.చలమయ్య, టీడీజేఏసీ చైర్మన్, నేలకొండపల్లి

ఎన్నికల కోసమే హడావుడి..



స్థానిక సంస్థల ఎన్నికల కోసం పథకం పేరుతో హడావుడి చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే యువతకు రుణాలు ఇవ్వాలి. లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత సత్తా చాటుతాం. వెంటనే రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాల్సిందే.

– అనంతు ఉపేందర్, యువజన ప్రతినిధి, నేలకొండపల్లి

పారదర్శకత పాటించాలి..



రాజీవ్ యువ వికాసం పథకం ఎంపికలో అధికారులు పారదర్శకత పాటించాలి. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి తలొగ్గకుండా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందించే ఏర్పాట్లు చేయాలి. పథకం ప్రకారం కచ్చితంగా అమలు చేసి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– కమదన ప్రవీణ్, కొత్తకొత్తూరు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అప్పగించాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న జర్నలిస్టులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన 23.02 ఎకరాల ఇళ్ల స్థలాన్ని వెంటనే అప్పగించాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి రమేష్‌బాబు కోరారు. ఖమ్మంలోని ఎన్నెస్పీ కాల్వకట్టపై జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో కొంత భాగం ఫెన్సింగ్ చేసి మొక్కలను నాటగా, సమీపం నుంచి కొందరు మట్టి తరలిస్తున్నారు. దీంతో జర్నలిస్టుల బృందం శనివారం స్థలాన్ని పరిశీలించగా రమేష్‌బాబు మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ కార్యదర్శి కొరకొప్పుల రాంబాబుతో పాటు జర్నలిస్టులు బిక్కి గోపి, ముత్యాల కోటేశ్వరరావు, అచ్చిరెడ్డి, సముద్రాల శ్రీధర్, ఎస్.కే.జానీ, మూల జీవన్‌రెడ్డి, పి.పానకాలరావు, ఉల్లోజు రమేష్, వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, మోహన్, గోవింద్, అప్పారావు, యాదగిరి, రోజా, సాయి, పులి శ్రీను, పెంటి వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

అభివృద్ధి పనులపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులతో శనివారం తన చాంబర్‌లో సమీక్షించారు. డివిజన్ల వారీగా ఏఈల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల స్థితి, పనుల ముగింపు వివరాలు, ఇంకా ఎన్ని రోజుల సమయం పడుతుందనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయించాలని, ఇంజనీర్లు నిరంతరం పనులు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లి పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఈ ఏ.కృష్ణాలాల్, డీఈఈలు ధరణికుమార్, శ్రీనివాస్, ఏఈలు పాల్గొన్నారు.

డ్రైవర్ ఉద్యోగ విరమణ వీడ్కోలు..

కేఎంసీలో ప్రభుత్వ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన అబ్దుల్ హకీంను మేయర్ పునుకొల్లు నీరజ సన్మానించి ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ జె.అనిల్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో పలువురి చేరిక

ఖమ్మంఅర్బన్: నగరంలోని మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయంలో శనివారం నగర సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో మెప్మా రిసోర్స్ పర్సన్ నగర సంఘానికి చెందిన 100 మంది సభ్యులు ఐఎన్‌టీయూసీలో చేశారు. వీరికి మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, కార్పొరేటర్ కమర్తపు మురళిలు వారందరికి కండవాలు కప్పి స్వాగతించారు. జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొత్త సీతారాములు, నగర అధ్యక్షుడు నరాల నరేష్ మోహన్‌నాయుడు సమన్వయంతో చేరినట్లు ప్రతినిధులు ప్రకటించారు. కార్యాక్రమంలో కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, నగర దీపికల సంఘ అధ్యక్షురాలు అంజు, వివిధ సంఘాల బాధ్యులు అష్రీఫ్, పమ్మి వెంకటేశ్వరరావు, హనుమంతరావు, కరుణ, సంగయ్య, ఫజల్, కె.ఎం.బీ.సార్థి నాగేశ్వరరావు, తోట సైదులు, జావేద్, రెడ్డి, కృష్ణతుంగ తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ ట్రస్ట్ ఆర్థిక సాయం

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన పలువురి మృతుల కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందించారు. శనివారం ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున మొత్తం 46 కుటుంబాలకు అందించారు.

సన్మానాలు..

రిటైర్డ్ డిప్యూటీ డెమోకు..

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ డెమో వరకు విధులు నిర్వర్తించిన సాంబశివారెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఈమేరకు శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ బి.కళావతి బాయి, అధికారులు, సిబ్బంది సాంబశివారెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు, డీపీహెచ్ఎన్ఓ డాక్టర్ మోతియా, డెమో సుబ్రహ్మణ్యం, స్టాటస్టికల్ ఆఫీసర్ నవీన్ కుమార్, యూనియన్ నాయకులు రమణ, సూపరింటెండెంట్ రాజేందర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్‌కు..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసిన గంగా ప్రసాద్ ఉద్యోగ విరమణ పొందారు. ఈమేరకు శనివారం పాఠశాలలో హెచ్ఎం విజయకుమారి ప్రసాద్‌ను సన్మానించి జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు సైదులు, చంద్రకళ, షబానా, సుజాత, కవిత, పాపారావు, రాజేశ్వరి, ప్రభుత్వ ఉపాధ్యాయులు పెసర ప్రభాకర్ రెడ్డి, ఏవీ నాగేశ్వరరావు, నరేందర్, కట్టా శ్రీనివాస్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

కవికి..



చిననర్సయ్యను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఏపీలోని నెల్లూరులో సేవ తెలుగు భాషా, సాహితీ సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యాన నిర్వహించిన తెలుగు భాషా ఉత్సవాల్లో ఖమ్మానికి చెందిన కవి కట్టెకోల చిననర్సయ్య 'సరిహద్దు సవాల్' శీర్షికన కవితను ఆలపించారు. మూడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో కవి కట్టెకోల కవిత వినిపించగా.. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, తిరుపతి విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి పద్మశ్రీ ఆచార్యులు రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, నిర్వాహకులు కంచర్ల సుబ్బానాయుడు తదితరులు మెమెంటో, పురస్కార పత్రం అందించి శాలువాతో సన్మానించారు.

'న్యూ విజన్'లో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో యాజమాన్యం, విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్, ప్రిన్సిపాల్ అబాద్ అలీలు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, ఎన్నికలు, ఓటు ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేసేలా మాక్ పోలింగ్ నిర్వహించామన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

డీఎంహెచ్ఓకు..



డీఎంహెచ్ఓకు వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

ఖమ్మంవైద్యవిభాగం: 104 వాహనాల్లో పనిచేసిన ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డ్రైవర్లకు ఇవ్వాల్సిన పెండింగ్ జీతాలు విడుదల చేయాలని ఉద్యోగులు శనివారం డీఎంహెచ్ఓ డాక్టర్ బి.కళావతి బాయికి వినతి పత్రం అందజేశారు. గతంలో 104 వ్యవస్థ రద్దు కావడంతో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, డయోగ్నస్టిక్ హబ్, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రుల్లో తమను సర్దుబాటు చేశారని, అక్కడ గత 6 నెలలుగా జీతాలు ఇవ్వట్లేదని, ఫలితంగా ఇబ్బంది పడుతున్నామని విన్నవించారు. ఈ మేరకు జీతాల విడుదలకు డీఎంహెచ్ఓ కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు.

మెడికల్ ఆఫీసర్‌కు..

నేలకొండపల్లి: మండలంలోని పని చేస్తున్న ఆశా కార్యకర్తల పారితోషకాలను వెంటనే చెల్లించాలని మెడికల్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్‌కు శనివారం ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన వినతి పత్రం అందించారు. పెండింగ్ వేతనాల చెల్లింపుతో పాటు రూ.18 వేల వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు జ్యోతి, విజయ, మరియమ్మ, సుజాత, రమాదేవి, అసన్న, సీటు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు.. అన్నదానాలు..

వినాయక చవితి నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం మండపాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన పూజలు, అన్నదానాలు కొనసాగాయి. పలు మండపాల్లో హోమ పూజలు నిర్వహించగా.. భక్తులు పాల్గొని స్వామివారిని తరించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం 41వ డివిజన్‌లో హనుమాన్ యూత్ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం



ఖమ్మంఅర్బన్: ఎస్ఆర్ హోమ్స్‌లో పూజలో పాల్గొన్న తుంబూరు దయాకర్‌రెడ్డి దంపతులు, నివాసులు

వినాయక లడ్డూలు చోరీ

నేలకొండపల్లి: అర్ధరాత్రి సమయాన వినాయక మండపాల వద్ద లడ్డూలు చోరీకి గురయ్యాయి. మండలంలోని మంగాపురంతండాకు చెందిన నాలుగు మండపాల వద్ద విగ్రహాల ముందున్న లడ్డూలు మాయమయ్యాయి.



ఖమ్మంఅర్బన్: ఇందిరానగర్‌లో హోమం పూజలో పాల్గొన్న భక్తులు



రంగవారి వీధిలో బాలగణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యాన పూజలు...

రాజకీయ పక్షాలతో సమావేశం



ఖమ్మంరూరల్: సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

కూసుమంచి/రఘునాథపాలెం/నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ రూపొందించిన వార్డుల వారీ ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాల తయారీ ప్రచురణపై శనివారం ఎంపీడీఓ కార్యాలయాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా కూసుమంచి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాంచందర్‌రావు గ్రామాల వారీగా అభ్యంతరాలను స్వీకరించారు. అలాగే రఘునాథపాలెం మండలం ఎంపీడీఓ కార్యాయంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ ఉస్మాన్ షరీఫ్‌లు వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఓటర్ల జాబితాలపై అభ్యంరాలు ఉంటే తెలపాలని, ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు. అలాగే నేలకొండపల్లి ఎంపీడీఓ కార్యాయంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య సమావేశం నిర్వహించి ప్రశాంత ఎన్నికల కోసం ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు పరిశీలిస్తున్న తెలిపారు. అదేవిధంగా ఖమ్మంరూరల్ మండలం ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ జాబితాలో ఉన్న డబుల్ ఓటర్లను తొలగించాలని, పిట్లవారిగూడెంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని వివిధ పార్టీల నాయకులు ఎంపీడీఓ శ్రీదేవికి విన్నవించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ శివ, ఎస్సై సంతోష్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు, ప్రజాప్రతినిధులు వి.దీపక్‌నాయక్, బండి వెంకన్న, రామ్మూర్తి, వీరునాయక్, గుత్తా రవి, సిద్దయ్య, వెంకటరెడ్డి, వేణు, పుచ్చకాయల సుధాకర్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, మాధం శెట్టి హరిప్రసాద్, కె.వీ.రెడ్డి, ఏటుకూరి రామారావు, నెల్లూరి భద్రయ్య, లక్ష్మణ్‌నాయక్, కె.లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.


అడ్డగోలుగా కార్మిక చట్టాల అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కోర్టులు ఇచ్చిన తీర్పును ప్రభుత్వాలు ఎందుకు అమలు చేయడం లేదని టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు పి.కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం ప్రశ్నించారు. శనివారం రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పాలకవర్గాలు తక్కువ జీతాలతో వెట్టిచాకిరీ చేయించుకోవడానికి లేబర్ యాక్ట్ 1970ను అడ్డగోలుగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ ప్రాదిపదికన నియమించిన ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, రెగ్యులర్ కార్మికులకు ఇస్తున్న వేతనాల ప్రకారం.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి అమలు చేయాలని, ఉద్యోగ భద్రతకు రక్షణ కల్పించాలన్నారు. నేడు కార్మికుల సంక్షేమం కోసం రూపొందించబడ్డ కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేస్తూ, ఈజీ డూయింగ్ బిజినెస్, (సులభతరమైన వ్యాపార విధానాలు) అనే పేరుతో విచ్చలవిడిగా పారిశ్రామిక అనుమతులు ఇవ్వడానికి పూనుకుంటోందని విమర్శించారు. ఇప్పటికైనా కార్మిక వర్గం ఐక్యంగా మరింత ఉధృతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీయూసీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ సివై పుల్లయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధికారుల హామీ



డబుల్‌బెడ్రూం కాలనీని పరిశీలిస్తున్న అధికారులు

కూసుమంచి: కూసుమంచి మండల కేంద్రంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని బీజేపీ ఆధ్వర్యాన అధికారులకు విన్నవించగా.. శనివారం తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాంచందర్ రావు గ్రామ కార్యదర్శి నీరజతో కలిసి సమస్యలున్న ప్రాంతాలను పరిశీలించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, డ్రెయినేజీలు అవసరమైన వీధులను, డబుల్ బెడ్రూం కాలనీని సందర్శించి సమస్యలను గుర్తించారు. కాలనీతో పాటు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపడంతో పాటు ప్రస్తుతం వర్షాలకు ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చివేస్తామని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈమేరకు బీజేపీ మండల నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్

గుంతలతో అవస్థలు..



మండలంలోని పిండిప్రోలు వద్ద వరంగల్ రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతుండగా.. రాత్రి సమయాన సమస్య తీవ్రంగా ఉంటుందని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

- తిరుమలాయపాలెం